# గౌతమీ గాథలు

ఇంద్రగంటి హనుమచ్ఛాస్త్రి

## వెన్నెల బయళ్లు

ఒక పెద్ద మనిషి.

స్ఫుటమైన విగ్రహం, మెత్తని నవ్వు, తియ్యని మాట.

రామచంద్రపురంలో మా యింటికి వచ్చి ఎదట నిలబడి.

"మొన్న మా టీచరు సెంటర్ క్లాసుకు పిలిస్తే రాలేదుగదూ— అందుకే నేను స్వయంగా ఆహ్వానిద్దామని వచ్చాను నా పేరు శ్రీ హరిరావు; డిప్యూటీ ఇన్స్పెక్టర్ ఆఫ్ స్కూల్స్— మామీద అంత చిన్నచూపెందుకు? పెద్ద సభల్లో ఎట్లాగూ మాట్లాడుతూ వుంటారు. కాని, మా ఎలిమెంటరీ టీచర్లకు సాహిత్యరుచి కలిగించడమే గొప్ప! వాళ్ళను ప్రభావితుల్ని చేస్తే ఒక తరం అంతా ప్రభావితం అవుతుంది. అదీ మీవంటివారు చేయదగింది. ఉపేక్షించడం తగదు. రేపు తప్పక రావాలి. వచ్చేదాకా వదలదలచుకోలేదు."

ఆ అచ్ఛమైన కోరికను, నేస్తాన్ని కాదనలేకపోయాను.

తన రాకతో ఆ రేంజి స్కూళ్ళ ఉపాధ్యాయుల్లో ఒక నవ్య చైతన్యం ప్రవేశపెట్టారు శ్రీహరిరావుగారు.

బస్సుల్లో వినోదయాత్రలు చేయించారు. కళాక్షేత్రాలు చూపించి శిల్పం మీద, కళమీద రుచి కల్పించారు. మంచి పుస్తకాలు చదివించి సాహిత్యాభిమానుల్ని చేశారు.

"రేపు వైశాఖ పౌర్ణమి: పండువెన్నెల్లో గోదావరిలో బోటుషికారు. మీరు తప్పక రావాలి."

శ్రీహరిరావుగారి పిలుపు!

రాత్రి 9 గంటలకు కోటిపల్లి గోదావర్లో రేవు నుంచి కోరుమిల్లి వరకు రెండు నావల్లో బయలుదేరాం. సుమారు 40, 50 మంది ఉత్సాహవంతులు వచ్చారు.

ఆఫీసర్లు, శాబేదార్లు, ఇన్స్పెక్టర్లు, పంతుళ్ళు అన్న భేదం లేదు. అంతా మమేకం. వెన్నెల అందం. హాయి చూరగొనడానికి ప్రతి మనిషికీ హక్కుంది.

నావల అంచున కూచున్నారు! గడలు పుచ్చుకు తోస్తున్నారు. "ఆడనే సుక్కాని ఈడనే గడ యేసి పడవెక్కి బద్రాద్రి పోదామా"- హుషారెక్కి ఒక టీచరు సన్నగా అందుకున్నాడు. శ్రీహరిరావుగారు వాళ్ళ ఉత్సాహంచూసి కన్నతల్లిలా గోదావరి నురుగులా నవ్వుకున్నారు.

ఒక నావలో నాలుగు అరటిపళ్ళగెలలు. పది బుట్టల పులిహోర. రెండు పెద్ద గంపల్లో మిఠాయి. మూడు కడవల పెరుగు అరిటాకు దిళ్లు. తమలపాకు కట్టలు. వక్కపొడిపొట్లాలు. వగైరా, వగైరా- బకాసురుడి బండిలా పేర్చారు.

చుట్టూ కూర్చున్న ఒకొక్క వృకోదరుడు ఎప్పుడు ఒడ్డు చేరుతామా అని తహతహ పడుతున్నాడు.

ఒకచోట పాలపొంగులా - ఒకచోట నీలాల హారంలా గోదావరి నావలపక్క గడల ఊపులకు గలగలమంటూ ప్రవహిస్తోంది.

కోరుమిల్లికి యెదురుగా ఒక పెద్ద ఇసకతిన్నెదగ్గర నావలుఆపి కొయ్యలకు కట్టేసి బయలుదేరాం. శుభ్రమైన ఇసకతిన్నె పట్టు తివాసి పరచినట్టుంది.

తెచ్చిన తుంగచాపలు పరిచారు భోజనప్రియులు 'పదార్థాలు భద్రం' అంటూ జాగ్రత్తగా దించారు. అరటాకులు పరిచారు. మొదటి మోతాదు పులిహోర పెరుగు; రెండవ రౌండ్‌లో బంతులాడినట్టు మిఠాయి ఉండలు కానిచ్చారు. తర్వాత చక్రకేళీ. అరటిపళ్ళు ఒకొక్కటే లాక్కు-తినడం సరదా.

తినుబండములు, త్రాగుబండములు అయాయి. పీల్పుబండములు, నమలుబండములు, ప్రైవేటుగా జరుగుతున్నాయి.

ఇన్స్పెక్టరుగారు, నేను కొంచెం కొంచెం తీసుకుని, వాళ్ళ స్వేచ్ఛకు భంగం లేకుండా దూరంగా జరిగాం.

హార్మోనియం తీశారు. గ్రామొఫోను పెట్టారు. సైగల్, పంకజ్, లతా, సుబ్బలక్ష్మి-నిశ్శరీరాత్మలు గాల్లో తేల్తున్నాయి!

సంగీతంతో వెన్నెల బరువెక్కి మదలు ముద్దలుగా రాలుతున్నట్టుంది! వెన్నెల పాలమడుగులో ఆ ఇసకతిన్నె తెల్లగలువపువ్వులా తేలుతోంది.

దూరంగా కూర్చుని గోదావరి కెరటాల మీదుగా కోరుమిల్లి అగ్రహారం చూస్తున్నాను. పల్లె నిద్రపోతోంది. రాజరాజు, నన్నయ్య, జ్ఞాపకం వచ్చారు. రాజరాజు ఈ అగ్రహారాన్ని చీదమార్యుడనే బ్రాహ్మడికి దానమిచ్చాడట! నీలి ఆకాశంఅంచునుంచి వెన్నెల మెట్లమీదుగా ఇద్దరూ తెలుగుమీఁదా, గోదావరిమీదా అభిమానం తీరక ఆవలి ఒడ్డుకు దిగుతున్నారేమో అనిపించింది.

తర్వాత.... "మరగు నీ వెన్నెలలు.... తగని సౌఖ్యజ్వాల" అన్నమాటలు మనసులో కదలి సలపరిస్తున్నాయి. ఏదో వెల్తి ఏదో అశాంతి! పాపం-ఆ అనుభవాన్ని చెప్పడానికి మాటదొరక్క "సౌఖ్యజ్వాల" అంటా డాయన-

పురుషుడు నిష్క్రియుడు. ప్రకృతి ఆటకత్తె ఇక్కడ ఇంతమంది పురుషులు. ప్రకృతి ఏదీ? పాపం ఆ చాపలమీద వాళ్ళకీ ఏదో బెంగ గాబోలు! దొలిచే దిగులు-వాటినికప్పుకోడానికి సంగీతాన్ని, కిల్లీలను, సిగరెట్లను ఆశ్రయిస్తున్నారు.

దయనీయులు!

ఆదిని 'ఆదాము' బెంగగా ఒకచోట పడి వుంటే భగవంతుడు అతని పక్క ఎముకను లాగి 'అవ్వ'గా చేసి తోడుగా ఇచ్చాడట. ఎవరో అన్నారు.

అర్ధనారీశ్వరుడన్నా అంతేగదా!

ఒక ఆదాముకు ఒక అవ్వ! బస్!

ఇప్పుడు ఎవరిస్తారు?

నురువులు నవ్వులుగా, అలల తళుకులు కళ్ళుగా, నల్లని నీటిజాలు దీర్ఘవేణిగా చేసి గోదావరి ఒకరమణీమణిని. ఈ వెన్నెలను కలిసి అనుభవించడానికి ప్రసాదించకూడదూ?

ఆలోచిస్తూ ఇసకమీద నడిచి ఎంత దూరం వెళ్ళానో?

మెత్తగా బుజానికి ఎవరో తగిలినట్టయింది. ఏదో మృదువాసన.

"కవితాసుందరి! రమ్మ చేగలిపి ప్రక్కన్ నిల్చి నాయంస మందివతాళించు భవద్భుజమ్మ విడి రమ్మి కౌముదీవేళ."

కవిత పెదవి కలిపింది.

వెనక్కి తిరిగి చూస్తే నవ్వుతూ రావుగారు!

తెల్లబోయాను.

"తెల్లవారుజామయింది. ఇక వెళదామా!" అన్నారు.

నావ దగ్గర మావాళ్ళు సిద్ధంగా వున్నారు.

చరచర నడచి వెళ్ళి నావ ఎక్కాం- యిద్దరం.